# జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ బిఎస్ఎన్ఎల్ యూనియన్స్ మరియు అసోసియేషన్స్

## ఆంధ్రప్రదేశ్ సర్కిల్

సర్క్యులర్ తేది 25-03-2010

## 26-3-2010న ధర్నాలు
## 20-4-2010 నుండి నిరవధిక సమ్మె

## డిమాండ్స్

1. బిఎస్ఎన్ఎల్‌లో 30% డిజిన్వెస్ట్‌మెంటు ప్రతిపాదనను విరమించాలి.
2. విఆర్ఎస్/ట్రాన్స్‌ఫర్ల పేరుతో లక్షమంది ఉద్యోగులను తొలగించే ప్రతిపాదన విరమించాలి.
3. లోకల్ లూప్ కాపర్ కేబుల్ అనే బండ్లింగ్ ప్రతిపాదన విరమించాలి.
4. ఔట్‌సోర్సింగ్ ప్రతిపాదన విరమించాలి.
5. ఐటిఎస్ అధికారులను బిఎస్ఎన్ఎల్‌లో విలీనం చేసే ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలి.
6. 93 మిలియన్ల లైన్ల జిఎస్ఎమ్ ఎక్విప్‌మెంట్ కొనుగోలు టెండర్‌ను పునరుద్ధరించి వెంటనే ఆర్డరు ఇవ్వాలి.
7. 1.1.2007కు ముందురిటైరైన వారికి ఐడిఏ పెన్షన్ రివైజ్ చేయాలి.

కామ్రేడ్స్,

సెల్‌ఫోన్ సర్వీసుల రంగంలో విస్తరించేందుకు అవసరమైన జిఎస్ఎమ్ ఎక్విప్‌మెంటు కొనుగోలుకు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా 2007 నుండి ఆటంకాలు సృష్టించినందున 2004-05లో రూ. 10,000 కోట్లుగా వున్న బిఎస్ఎన్ఎల్ లాభం 2008-09లో రూ. 574 కోట్లకు పడిపోయింది. సెల్‌ఫోన్ వినియోగదారుల సంఖ్య విషయంలో 2006లో రెండవ స్థానంలో వున్న బిఎస్ఎన్ఎల్, ఈ విధానాల కారణంగా ఇప్పుడు 4వ స్థానంకు దిగజారింది.

ఈ విధంగా బిఎస్ఎన్ఎల్‌ను దిగజార్చిన ప్రభుత్వం ఇప్పుడు శ్యాంపిట్రోడా అధ్యక్షతన ఒక కమిటీని నియమించి బిఎస్ఎన్ఎల్‌కు, ఉద్యోగులకు, దేశ ప్రయోజనాలకు వ్యతిరేకమైన సిఫార్సులు చేయించింది. ఈ సిఫార్సులను వెన్నెముక లేని బిఎస్ఎన్ఎల్ బోర్డు ఆమోదించి, డిఓటి నిర్ణయానికి పంపించింది.

బిఎస్ఎన్ఎల్‌లో 30% వాటాలు అమ్మాలని శ్యాంపిట్రోడా కమిటీ చేసిన సిఫార్సు ఉద్దేశం బిఎస్ఎన్ఎల్‌ను ఉద్ధరించటానికి కాదు, దానిని వేగంగా ప్రైవేటుపరం చేసేందుకే. ఈ విధంగా డిజిన్వెస్టుమెంటు చేసినందున వచ్చే సొమ్ము ప్రభుత్వ ఖజానాకు జమ అవుతుందేగాని, బిఎస్ఎన్ఎల్‌కు ఒక్క పైసా కూడా దక్కదు. 2009-10 బడ్జెటులో సంపన్నులకు, బడా పెట్టుబడిదారులకు రూ. 80,000 కోట్లు రాయితీలిచ్చిన ప్రభుత్వం ఇప్పుడు దీనికి అదనంగా 2010-11 సంవత్సరం బడ్జెటులో మరో రూ. 26,000 కోట్లు రాయితీలిచ్చింది. సంపన్నులకు ఈ విధంగా రాయితీలిచ్చినందున బడ్జెటులో ఏర్పడిన లోటును భర్తీ చేసేందుకు ప్రభుత్వరంగ సంస్థల డిజిన్వెస్టుమెంటుకు పూనుకుంటున్నది. ఒకవంక బడ్జెటులో రాయితీలు, మరోవంక విలువైన ప్రభుత్వరంగ సంస్థల వాటాలను డిజిన్వెస్టుమెంటు పేరుతో కారుచౌకగా అప్పగించటం- ఈ రెండు విధాలా ప్రజలు సృష్టించిన సంపదను సంపన్న పారిశ్రామిక వర్గాలకు అనుచితంగా సమర్పించే విధంగా మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. ఈ దుష్ట విధానంలో భాగంగానే బిఎస్ఎన్ఎల్ డిజిన్వెస్టుమెంటుకు ప్రయత్నం జరుగుతున్నది.

12 కోట్ల వినియోగదారులున్న ఎయిర్‌టెల్‌కు 25000 మంది ఉద్యోగులుండగా 9 కోట్ల వినియోగదారులున్న బిఎస్ఎన్ఎల్‌కు

3 లక్షలమంది ఉద్యోగులుండాల్సిన అవసరం లేదని, కాబట్టి లక్షమందిని వీఆర్ఎస్/ట్రాన్స్‌ఫర్ల పేరుతో తొలగించాలని శ్యాంపిట్రోడా కమిటీ సిఫార్సు చేసింది. ల్యాండ్‌లైన్లు నామమాత్రంగా వుంచి సెల్‌ఫోన్ సర్వీసుల ఎక్విప్‌మెంటు మరియు నెట్‌వర్క్ స్థాపన మరియు నిర్వహణ మొత్తాన్ని విదేశీ టెలికం ఎక్విప్‌మెంటు తయారీ కంపెనీలకు అప్పగించి తాను కేవలం బ్రాండింగు మరియు మార్కెటింగుకే పరిమితమైనందున ఎయిర్‌టెల్‌కు 25,000 మంది సిబ్బంది సరిపోయారు. ఇందుకు భిన్నంగా బిఎస్ఎన్ఎల్‌కు దేశవ్యాపితంగా విస్తరించిన ల్యాండ్‌లైన్ నెట్‌వర్క్ వున్నది. ల్యాండ్‌లైన్, సెల్‌ఫోన్ సర్వీసుల నెట్‌వర్క్‌ను ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాలలో బిఎస్ఎన్ఎల్ స్వయంగా నిర్వహిస్తున్నది. దీనికి అదనంగా సేల్సు, మార్కెటింగ్ కూడా చేయాలి. కాబట్టి 3 లక్షలమంది సిబ్బంది బిఎస్ఎన్ఎల్‌కు అవసరమే. ఇంతేగాక ప్రతి సంవతసరమూ 10 వేలమంది సిబ్బంది రిటైరవుతున్నారు. కాబట్టి సిబ్బంది అధికమూ కాదు, వీఆర్ఎస్ అవసరమూ లేదు. ప్రైవేటీకరణకి వీలుగా సిబ్బందిని తగ్గించటానికే ఈ కుట్ర జరుగుతున్నది. సంస్థ ప్రైవేటుపరమైతే పెన్షన్‌కు కూడా భద్రత వుండదు.

బిఎస్ఎన్ఎల్‌కు దేశవ్యాపితంగా పట్టణాలు, పల్లెలు అన్నింటా విస్తరించిన లోకల్ కాపర్ కేబుల్ నెట్‌వర్కు వున్నది. ఈ లోకల్ కాపర్ కేబుల్ లూప్‌ను ఉపయోగించి సమర్థవంతమైన, నాణ్యమైన బ్రాడ్‌బ్యాండ్ సర్వీసులను బిఎస్ఎన్ఎల్ అందిస్తున్నది. ప్రైవేటు కంపెనీలతో పోలిస్తే బ్రాడ్‌బ్యాండ్ సర్వీసుల రంగంలో బిఎస్ఎన్ఎల్ అగ్రస్థానంలో వున్నది. కానీ ఈ అనుకూల పరిస్థితి బిఎస్ఎన్ఎల్‌కు లేకుండా చేసేందుకు కుట్ర జరుగుతున్నది. బిఎస్ఎన్ఎల్ లోకల్ కాపర్ కేబుల్ లూప్ అన్‌బండ్లింగుకు, అనగా లోకల్ లూప్‌ను ప్రైవేటు కంపెనీలు బ్రాడ్‌బ్యాండ్ సర్వీసులు ఇచ్చేందుకు వీలుగా అద్దెకి ఇవ్వాలని, శ్యాంపిట్రోడా కమిటీ సిఫార్సు చేసింది.

ఎయిర్‌టెల్, రిలయన్స్, ఐడియా తదితర ప్రైవేటు టెలికం సర్వీసుల కంపెనీలన్నీ తమ నెట్‌వర్క్ ఇన్‌స్టలేషన్ మరియు నిర్వహణ బాధ్యత మొత్తాన్నీ విదేశీ టెలికం ఎక్విప్‌మెంటు తయారీ సంస్థలకు (నోకియా, ఎరిక్‌సన్, హువాయి మొ॥నవి) అప్పగించి తాము బ్రాండింగ్ మరియు మార్కెటింగ్‌కే పరిమితమయ్యాయి. ఈ విధంగా ఔట్‌సోర్సింగ్ చేసి మన టెలికం నెట్‌వర్క్‌ను విదేశీ నిర్వహణకు అప్పగించటం దేశభద్రతకి ముప్పు కలిగిస్తుందని, కాబట్టి టెలికం సర్వీసు కంపెనీలు తమ నెట్‌వర్క్‌ను తామే నిర్వహించుకోవాలని డిఓటి ఇచ్చిన సలహాను ప్రైవేటు టెలికం కంపెనీలు లెక్క చేయలేదు. ఔట్‌సోర్సింగ్ విధానాన్నే కొనసాగిస్తున్నాయి. ఇప్పుడు బిఎస్ఎన్ఎల్ కూడా ఇదే విధమైన ఔట్‌సోర్సింగ్ విధానాన్ని అనుసరించాలని శ్యాంపిట్రోడా కమిటీ సిఫార్సు చేసింది. ఇది మన ఉద్యోగభద్రతకే కాకుండా దేశభద్రతకి కూడా ప్రమాదకరం.

1500 మంది ఐటిఎస్ అధికారులు ఢిల్లీ నుండి జిల్లా వరకు బిఎస్ఎన్ఎల్ మేనేజర్లుగా వుండి, సంస్థకి నాయకత్వం వహిస్తున్నారు. కానీ వీరు బిఎస్ఎన్ఎల్‌లో విలీనం (ఎబ్జార్బ్) కాకుండా డెప్యుటేషన్లో వున్న ప్రభుత్వ అధికారులుగానే కొనసాగుతున్నారు. అద్దె ఇంట్లో వుండేవారు ఇంటి బాగోగులు పట్టించుకోనట్లే వీరికి కూడా బిఎస్ఎన్ఎల్ అభివృద్ధి పట్ల ఆసక్తి లేకుండాపోయింది. తమ భవిష్యత్తుకు బిఎస్ఎన్ఎల్ అభివృద్ధితో సంబంధం లేనందున వీరు సంస్థ అభివృద్ధికి అవసరమైన రీతిలో స్పందించటం లేదు. కాబట్టి వీరు బిఎస్ఎన్ఎల్‌లో విలీనమై అంకితభావంతో పనిచేయాలి లేదా బిఎస్ఎన్ఎల్ నుండి వెళ్ళిపోవాలి.

4 కోట్ల లైన్ల జిఎస్ఎమ్ ఎక్విప్‌మెంట్ కొనుగోలుకు సంబంధించిన టెండర్‌ను ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా రద్దు చేసే పరిస్థితి ఏర్పడిన సందర్భంలో 11.7.2007న అందుకు వ్యతిరేకంగా బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు, అధికారులు అందరూ సమ్మె చేసినందున ప్రభుత్వం దిగివచ్చి, 2 కోట్ల లైన్ల ఎక్విప్‌మెంటు కొనుగోలుకు అంగీకరించింది. ఆ తరువాత మరో 9.3 కోట్ల లైన్ల జిఎస్ఎమ్ ఎక్విప్‌మెంట్ కొనుగోలుకు బిఎస్ఎన్ఎల్ టెండరు పిలిచింది. దీనికి కూడా అనేక ఆటంకాలు సృష్టించారు. తన టెండరును తిరస్కరించినందుకు వ్యతిరేకంగా నోకియా కంపెనీ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నుండి స్టే తెచ్చింది. కానీ ఆ తరువాత నోకియా పిటిషన్‌ను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కొట్టివేసింది. నోకియా టెండర్ తిరస్కరణ సరైందేనని రుజువైంది. కానీ ఆ తరువాత సెంట్రల్ విజిలెన్స్ కమీషనర్‌కు ఫిర్యాదు చేసారు. సెంట్రల్ విజిలెన్స్ కమీషన్ ఆమోదంతో ఏర్పడిన ఒక స్వతంత్ర కమిటీ ఈ టెండరు విషయంలో బిఎస్ఎన్ఎల్ అనుసరించిన విధానం సరైందేనని ధృవీకరించింది. ఈలోగా ఇతర దేశాలతో సరిహద్దులున్న ఉత్తర భారతదేశపు సర్కిల్సుకు అవసరమైన జిఎస్ఎం ఎక్విప్‌మెంటును చైనా కంపెనీ హువాయి నుండి కొనుగోలు చేయటం దేశభద్రతకి ప్రమాదం కాబట్టి ఆ కొనుగోలును ఆపాలని ప్రభుత్వం బిఎస్ఎన్ఎల్‌ను ఆదేశించింది. కానీ రిలయన్స్‌కు మాత్రం అదే చైనా కంపెనీ నుండి ఎక్విప్‌మెంటు కొనుగోలుకు ప్రభుత్వం, బిఎస్ఎన్ఎల్‌కు అభ్యంతరం తెలియజేసిన సర్కిల్సులో కూడా అనుమతించింది. టెండర్ ఆమోదించిన అనంతరం రేటు మరికొంత తగ్గించాలని ఎక్విప్‌మెంటు సప్లైదారు ఎరిక్‌సన్ కంపెనీతో బిఎస్ఎన్ఎల్ చర్చించటాన్ని సెంట్రల్ విజిలెన్స్

తప్పుపట్టింది. ఇన్ని రకాల అభ్యంతరాలతో ఈ టెండర్‌ను ముందుకు తీసుకుపోవటం సాధ్యం కాదని బిఎస్ఎన్ఎల్ బోర్డు నిర్ణయించింది. ఇప్పుడు శ్యాం పిట్రోడా సిఫార్సుల పేరుతో ఈ టెండర్‌ను రద్దు చేసింది. ఈ విధంగా సెల్‌ఫోన్ సర్వీసుల రంగంలో బిఎస్ఎన్ఎల్‌ను ముందుకు పోనీయకుండా వుంచేందుకు ప్రభుత్వం మరియు ప్రైవేటు కంపెనీలు కుట్ర చేసి ఎక్విప్‌మెంటు కొరత సృష్టించాయి. ఈ అక్రమాన్ని విరమించి, బిఎస్ఎన్ఎల్‌కు అవసరమైన 9.3 కోట్ల లైన్ల జిఎస్ఎమ్ ఎక్విప్‌మెంటు కొనుగోలుకు ప్రభుత్వం అనుమతించాలి.

1.1.2007 తరువాత రిటైరైన బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు పే రివిజన్, దానితో పాటు పెన్షన్‌రివిజన్ అమలు జరుగుతుంది. కాగా పే రివిజన్‌కు ముందు, అనగా 1.1.2007కు ముందు రిటైరైన వారికి పెన్షన్ రివిజన్ 1.1.2007 నుండి అమలుచేయాలి. కానీ ఇందుకు అనుమతించే నిబంధన రూల్-37లో లేనందున, వీరి పెన్షన్ రివిజన్ చేయటం డిఓటికి సాధ్యం కాలేదు. కాబట్టి దీనిని సాధ్యం చేసేందుకు వీలుగా రూల్-37ని సవరించాలని డిఓటి ఒక ప్రతిపాదన కేబినెట్ ఆమోదం కోసం తయారుచేయబూనుకున్నది. 1.1.2007కి ముందు రిటైరైన వారికి 31.12.2006 వరకు ఐడిఏ స్కేలు పై పెన్షన్ చెల్లించి, 1.1.2007 నుండి ఐడిఏ స్కేలుపై కాకుండా సిడిఏ స్కేలుపై పెన్షను రివైజు చేయాలని ప్రతిపాదించింది. దీనివలన పెన్షన్ కొంత పెరిగినా, ఐడిఏ పే పై రివైజు చేస్తే పెరిగినంతగా పెరగదు. ఉద్యోగుల, పెన్షనర్ల సంఘాలు ఒత్తిడి చేసిన అనంతరం ఇప్పుడు ఈ ప్రతిపాదనను మార్చి, ఐడిఏ పే స్కేలుపై పెన్షన్ రివిజన్ చేయాలనే ప్రతిపాదనను తయారుచేసేందుకు డిఓటి అంగీకరించింది. డిఓటి తయారుచేసి పంపించే ఈ ప్రతిపాదనను కేబినెట్ ఆమోదిస్తేనే ఐడిఏ పెన్షన్ రివిజన్ సాధ్యమవుతుంది. ఇందుకోసం మనం ప్రభుత్వం పై ఒత్తిడి చేయాలి.

బిఎస్ఎన్ఎల్ డిజిన్వెస్టుమెంటు మరియు విఆర్ఎస్‌కు ప్రభుత్వం గతంలో రెండుసార్లు ప్రయత్నించగా మనం సమైక్యంగా పోరాడి ఆపుజేయగలిగాము. ఇప్పుడు కూడా ఈ దుష్ట విధానాలను త్రిప్పికొట్టి బిఎస్ఎన్ఎల్‌ను, మన భవిష్యత్తును కాపాడుకోవటం సాధ్యమే. ఇందుకోసం బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు, అధికారులు అందరూ ఐక్యంగా పోరాడాలి. మన పోరాటానికి మద్దతునిచ్చే ట్రేడ్ యూనియన్లు, రాజకీయ పార్టీల మద్దతుతో మరింత ఒత్తిడిని ప్రభుత్వంపై తీసుకురావాలి.

కాబట్టి పై డిమాండ్ల కోసం 26.3.2010న అన్ని జిల్లా కేంద్రాలలో పెద్ద ఎత్తున ధర్నాలు చేయాలని, 20.4.2010న ఒకరోజు సమ్మె చేయాలని కేంద్ర జాయింట్ ఫోరం ఇచ్చిన పిలుపును మన సర్కిలులో జయప్రదంగా అమలుచేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

***బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల, అధికారుల ఐక్యత వర్ధిల్లాలి!***

అభినందనలతో

**జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ బిఎస్ఎన్ఎల్ యూనియన్స్ & అసోసియేషన్స్, ఆంధ్రప్రదేశ్ సర్కిల్**

**ఎ. రాజమౌళి**
చైర్మన్, జెఎసి &
సర్కిల్ సెక్రటరీ, ఎన్ఎఫ్‌టిఇ

**జె. సంపత్‌రావు**
కన్వీనర్, జెఎసి &
సర్కిల్ సెక్రటరీ, బిఎస్ఎన్ఎల్ఇయు

**కె. జయప్రకాష్**
సర్కిల్ సెక్రటరీ, ఎన్‌యుబిఎస్ఎన్ఎల్ (డబ్ల్యు)
(ఎఫ్ఎన్‌టిఓ)

**ఎస్. రాంబాబు**
సర్కిల్ సెక్రటరీ, బిఎస్ఎన్ఎల్‌డబ్లుఆర్‌యు

**జె. సాయిబాబా**
సర్కిల్ సెక్రటరీ, ఎఐబిఎస్ఎన్ఎల్ఇఏ

**పి. పద్మనాభరావు**
సర్కిల్ సెక్రటరీ, ఎస్ఎన్ఇఏ (ఐ)